మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 215 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

సోమవారం 14 అక్టోబర్ 2024



# తెలంగాణ రాష్ట్ర సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి

- ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యు వరకు, కమ్యూనిస్టు నుంచి కాంగ్రెస్ వరకూ తెలంగాణ కోసం ఉద్యమించాయి
- అన్ని సామాజిక వర్గాలు కార్యోన్ముఖులు కావడానికి అలయ్ బలయ్ దోహదం
- అంతరించిపోతున్న సంస్కృతీ సంప్రదాయాలను పునరుద్ధరిచడానికి యత్నిస్తున్నాం
- ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** తెలంగాణ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపచేయడమే 'అలయ్ బలయ్' ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండగ దసరా అని చెప్పారు. ఈ పర్వదినాన గుర్తొచ్చేది పాలపిట్ట, జమ్మి చెట్టు అన్నారు. 'అలయ్ బలయ్' అంటే గుర్తొచ్చేది బండారు దత్తాత్రేయ అని చెప్పారు. ఆయన నుంచి వారసత్వంగా తీసుకొని విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడానికి 'అలయ్ బలయ్' స్ఫూర్తిగా పనిచేసిందని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా దీన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. దత్తాత్రేయ.. తెలంగాణ సంస్కృతిని కాపాడేలా కృషి చేస్తున్నారని కొనియాడారు.

**ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె

మిగతా 2లో..



# పేదల పక్షపాతి సాయిబాబా కన్నుమూత

## అనారోగ్యంతో నిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన ప్రొఫెసర్

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబా (54) శనివారం రాత్రి హైదరాబాద్ నిమ్స్‌లో కన్నుమూసిన విషయం తెలిసిందే. అయితే, ఆయన కోరిక మేరకు భౌతికకాయాన్ని ఆస్పత్రికి అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఇప్పటికే సాయిబాబా నేత్రాలను ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసినట్లు తెలిపారు.సాయిబాబా భౌతిక కాయాన్ని హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌కు తరలించారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు నివాళులు అర్పించిన అనంతరం ఆయన కోరిక మేరకు భౌతికకాయన్ని ఆస్పత్రికి అందజేస్తామని కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. 2017లో ఆయనకు గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవితఖైదు విధించడంతో దాదాపు పదేళ్ల పాటు ఆయన జైల్లోనే గడపాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించడంతో నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. మానవహక్కుల ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్తగా సాయిబాబా గుర్తింపు పొందారు.ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతిపట్ల తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం పౌర హక్కుల ఉద్యమానికి తీరని లోటుగా పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించారని, తన స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా అవిశ్రాంతంగా పోరాడారని కొనియాడారు. పౌర హక్కులను కాపాడే క్రమంలో సవాళ్లు ఎదురైనా సాయిబాబా చూపిన ధైర్యసాహసాలు చిరస్థాయిగా నిలుస్తాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.హక్కుల

మిగతా 2లో..

## పొలిట్రిక్స్

ఐ.ఎ. హబ్బులంట
కంప్యూటర్ పనులకు
సాఫ్ట్‌వేర్లు వెడతారా
సాఫ్టుగా ఇళ్లకు ?

మనిషికంటే మేలంట
మానవ పనికి రోబోట్లు ,
తేడావస్తే లెక్కలకు
పడవా మరి తూట్లు ??!

- న్యాలకంటి నారాయణ
9346200066

# తప్పుడు పత్రాలతో రూ.288 కోట్ల భారీ కుంభకోణం

- జీఎస్టీ చట్టంలో ఉన్న లొసుగులు అడ్డం పెట్టుకొని యథేచ్ఛగా అక్రమాలు
- జీఎస్టీ వ్యవహారంలో బయటపడుతున్న నిజాలు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** రాష్ట్రంలో తప్పుడు పత్రాలతో రూ.288 కోట్ల భారీ మొత్తం జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను దాదాపు 350 మంది డీలర్లు దోచేశారు. కంపెనీలు తెరచి వ్యాపారం చేయకుండానే చేసినట్లు కాగితాలపై చూపి భారీ మొత్తంలో ఐటీసీ నొక్కేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నర పాటు ఓ ట్యాక్స్ కన్సల్టెంట్ చేసిన వ్యవహారాన్ని జీఎస్టీ అధికారులు ఆలస్యంగా గుర్తించి అప్రమత్తమై ఐదు రాష్ట్రాల్లోని డీలర్ల ఖాతాలను స్తంభింప చేయడం ద్వారా ప్రభుత్వ సొమ్మును కొంత వరకు కట్టడి చేయగలిగారు. జీఎస్టీ



ప్రాక్టీషనర్‌ను అరెస్టు చేసిన అధికారులు ఇప్పటివరకు రూ.11 కోట్ల వరకు వివిధ కంపెనీల నుంచి రికవరీ చేసినట్లు తెలుస్తోంది. జగిత్యాలలో చందాసాయికుమార్ జీఎస్టీ ప్రాక్టీషనర్ దాదాపు 32 బోగస్ సూట్‌కేసు కంపెనీలను సృష్టించి భారీగా అక్రమాలకు పాల్పడ్డాడు. జీఎస్టీ ప్రాక్టీషనర్ అయినందున ఎవరైనా కొత్తగా వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయాలంటే ఇతనినే కలిసేవారు. అదేవిధంగా వివిధ కారణాలతో తమ వ్యాపార సంస్థలను మూసివేయాలన్నా కూడా ఇతని వద్దకే వెళ్లి అందుకు కావాల్సిన ప్రక్రియను పూర్తి చేసేవారు. వివిధ కారణాలతో తమ వ్యాపార సంస్థలను మూసివేయాలని తమ వద్దకు వచ్చిన వారి నుంచి పాన్, ఆధార్ కార్డులను సేకరించేవాడు. జీఎస్టీ చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా తీసుకొని కంపెనీలను మూసివేయమని తనకు ఇచ్చిన పాన్ నంబర్లు, ఆధార్ కార్డులను ఉపయోగించి ఫోన్?నంబర్లు మార్చి వాటిని మూసివేయకుండా కొనసాగించాడు. క్షేత్రస్థాయిలో వ్యాపార లావాదేవీలు నిర్వహించకుండానే పేపర్?పైనే లావాదేవీలు నిర్వహించినట్లు చూపించి తప్పుడు పత్రాలు జీఎస్టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఇలా మొత్తం 32 బోగస్ సంస్థలను

మిగతా 2లో..



# బంగాళాఖాతంలో అల్పపీడనం..

- 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

**అమరావతి (ప్రజా మంటలు):** దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు తిరోగమిస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అసోం, మేఘాలయ, అరుణాచల్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మహారాష్ట్ర సహా ఉత్తర బంగాళాఖాతం నుంచి రుతుపవనాలు క్రమంగా వైదొలగుతున్నాయని పేర్కొంది.మరో రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే పరిస్థితులు మారుతున్నాయని తెలిపింది.అదే సమయంలో దక్షిణ భారత దేశ ద్వీపకల్పం మీదుగా తూర్పు, ఈశాన్య గాలులు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయని, వీటి ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాలతో పాటు మధ్య బంగాళాఖాతంలో వర్ష పాతం నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, అక్టోబరు 14 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. మరో 48 గంటల్లో ఇది మరింతగా బలపడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు కదిలే అవకాశం ఉందని, వీటి ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

## ప్రజా నాడి




# కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్నది ఎవరు?

## - మంత్రిపైన దాడులు జరిగినా స్పందించని బిజెపి - కేటీఆర్



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** ఢిల్లీలో కొట్లాడుతున్నట్టు నాటకం ఆడుతూ తెలంగాణలో అంట కాగుతున్న కాంగ్రెస్, బీజేపీ బంధంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నా బిజెపి పార్టీ నేతలు ఎవరు కూడా ఈ అంశం పైన మాట్లాడడం లేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నదని నిలదీశారు. ఫిక్షన్ కంటే వాస్తవం వింతగా ఉంటుందని అంటుంటారని.. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తుంటే దాన్ని నమ్మక తప్పడం లేదని కేటీఆర్ అన్నారు. ఈ మధ్యనే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండు కీలకమైన సంఘటనలను కేటీఆర్ ప్రస్తావించారు. తెలంగాణలో ఒక సంపన్నమైన కాంగ్రెస్ మంత్రి నివాసంలో రెండు వారాల కిందట ఈడీ దాడి చేసిందన్న, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసం పైన ఈడి జరిపిన దాడుల అంశాన్ని ప్రస్తావించారు. ఆ దాడిలో వందల కోట్ల నగదు దొరికిందని మీడియాలో కథనాలు వస్తున్నాయని అన్నారు. రెండు వారాలు పూర్తయిన తర్వాత కూడా ఇప్పటిదాకా ఈ సంఘటన తాలూకు ఒక్క మాట బయటకి రాలేదని కేటీఆర్ తెలియజేశారు. అయితే ఇప్పటికీ కాంగ్రెస్ గానీ.. బీజేపీ నుంచి గానీ.. ఈడీ నుంచి గానీ ఈ అంశంపైన నోరు మెదపలేదని పేర్కొన్నారు.కర్ణాటకలో జరిగిన వాల్మీకి కుంభకోణం ద్వారా వచ్చిన 40 కోట్ల అక్రమ ధనాన్ని పార్లమెంటు ఎన్నికల సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ ఉపయోగించిందని స్వయంగా తన ప్రకటనలో ఈడీ వెల్లడించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టులు ఏమీ జరగలేదని తెలిపారు. కనీసం దారి మళ్లిన నిధుల తాలూకు అంశం పైన ఇప్పటిదాకా ప్రాథమిక విచారణ కూడా చేయకపోవడం పట్ల కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. వీటన్నింటి బట్టి ఈడీ నుంచి తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను రక్షిస్తున్న పెద్ద అన్న ఎవరై ఉంటారని ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ రాష్ట్ర సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి



విజయలక్ష్మి అధ్యక్షతన 'అలయ్ బలయ్' నిర్వహిస్తున్నారు.దత్తాత్రేయ ఢంకా మోగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారుల సంప్రదాయ నృత్యాలు, కోలాటం, గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోతురాజుల విన్యాసాలు, హైదరాబాదీ సంప్రదాయ మర్ఫా వాయిద్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి పాల్గొన్నారు.ఏటా దసరా మరుసటి రోజు 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అన్ని పార్టీల నేతలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేస్తారు. ఇక్కడ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

**రేవంత్ రెడ్డి, చంద్రబాబు కలసిమెలసి పనిచేయాలి : దత్తాత్రేయ**

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దసరా సమ్మేళనం–2024 వైభవంగా జరిగింది. అలయ్ బలయ్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఢంకా మోగించగా, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు లాంఛనంగా ప్రారంభించారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటం, గిరిజన నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, పులి వేషాలు అలయ్ బలయ్‌లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టాయి. హైదరాబాదీ సంప్రదాయ మర్ఫా వాయిద్య సంగీతం విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మాట్లాడిన బండారు దత్తాత్రేయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలసిమెలసి రాష్ట్రాల అభివృద్ధి కోసం పని చేయాలని అన్నారు. రాజకీయాలకతీతంగా పరస్పరం సహకరించుకుని, ఐకమత్యంతో ముందుకు వెళ్లి, దేశంలోనే తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను అగ్రస్థానంలో నిలపాలని దత్తాత్రేయ సూచించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా 2005లో అలయ్ బలయ్ ప్రారంభించామని, ప్రేమ, ఆత్మీయత, ఐఖ్యత చాటి చెప్పాలన్నదే అలయ్ బలయ్ లక్ష్యమని వివరించారు. ఈసారి కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తూ అలయ్ బలయ్‌లో ప్రదర్శించామన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ, సీఎం రేవంత్? రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, రాజస్థాన్ గవర్నర్ హరిబాబు పగాడే, మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ శంకర్, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, నటుడు కోట శ్రీనివాసరావు, తెలంగాణ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బీబీపాటిల్, సీపీఐ నేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్ తదితరులు హాజరయ్యారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా అందరూ ఏకం కావాలి : 'అలయ్ బలయ్' సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకటయ్యానాయుడు అన్నారు. స్నేహశీలి అయిన బండారు దత్తాత్రేయ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఓ చక్కని సంప్రదాయాన్ని ఏర్పాటు చేయటం, వారి కుమార్తె విజయలక్ష్మి ఆ సంస్కృతిని కొనసాగించటం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా, సమైక్యతా భావాన్ని పెంపొందిస్తాయన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో సమైక్యతా వారధుల నిర్మాణం మనందరి సామాజిక బాధ్యతగా పేర్కొన్న ఆయన, ఒకప్పుడు ఐక్యత లేక పరాయి పాలనలో సమస్యలు అనుభవించామన్నారు. ఇప్పుడు పాశ్చాత్య అనుకరణ కారణంగా కుటుంబానికి, సమాజానికి దూరమౌతున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మన భారతీయ సంస్కృతిలో భాగమైన ఇలాంటి కార్యక్రమాల ద్వారా అందరూ ఏకం కావాలన్నారు.ఐక్యంగా ఉండటం అంటే అంతా ఒకే మాట మీద నిలబడటమే కాదు, పక్కవారి ఆలోచనలను, భావాలను గౌరవించటం కూడా అని వెంకయ్య వివరించారు. అలయ్ బలయ్ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదిక మీద చూడటం ఎంతో ఆనందంగా ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు సిద్ధాంతాలకే పరిమితం కావాలని, నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితే, అది కార్యకర్తల వరకూ పాకుతుందని, ఇది సమాజ శ్రేయస్సుకు మంచిది కాదని హితవు పలికారు. ఇలాంటి కార్యక్రమాల స్ఫూర్తితో సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని, సమష్టి తత్వాన్ని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు వెంకయ్యనాయుడు అన్నారు.

# పేదల పక్షపాతి సాయిబాబా కన్నుమూత

### అనారోగ్యంతో నిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన ప్రొఫెసర్

ఉద్యమకారుడు ప్రొఫెసర్ జీ. ఎన్. సాయిబాబా అకాల మరణం బాధాకరమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశంలోని ప్రజా ఉద్యమాలకు సాయిబాబా మరణం తీరని లోటన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా దేశద్రోహ నేరం మోపి 90శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను ఉపా చట్టం కింద సుదీర్ఘ కాలంగా జైలులో నిర్బంధించిందని మండిపడ్డారు. అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసిందన్నారు. జైలులో వున్న సమయంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా సరైన వైద్య సౌకర్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయిబాబా దళిత, గిరిజన, వికలాంగుల హక్కుల నేతగా, విద్యావేత్తగా పేరొందారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు" అని పేర్కొన్నారు.

## తప్పుడు పత్రాలతో రూ.288 కోట్ల భారీ కుంభకోణం

తెరచి వాటి ద్వారా అత్యధిక జీఎస్టీ స్లాబ్ ఉన్న సిమెంట్, ఐరన్లను వ్యాపారం చేసినట్లు కాగితాల్లో చూపించాడు.తన బోగస్ సంస్థల ఖాతాల్లో జమైన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మొత్తాన్ని ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 350 మంది వ్యాపారులకు బదిలీ చేసినట్లు గుర్తించారు. తెలంగాణలో 302 మంది వ్యాపారస్థులు ఉండగా, మరో 48 మంది వ్యాపారులు ఐదు రాష్ట్రాల్లో ఉన్నట్లు జీఎస్టీ అధికారులు గుర్తించారు. జగిత్యాల కేంద్రంగా ట్యాక్స్ కన్సల్టెంట్ ద్వారా జరిగిన రూ.288 కోట్ల ఐటీసీ కుంభకోణం 2022 అక్టోబరు నుంచి 2023 డిసెంబరు వరకు జరిగినట్లు అధికారులు తేల్చారు. ఈ కుంభకోణం బయటకు రాకుండా ఉండేందుకు అధికారులను మస్కా కొట్టించేందుకు ఈ ట్యాక్స్? కన్సల్టెంట్? ఐటీసీ 02 ఫార్మ్?ను ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. ఆయా డివిజన్ల పరిధిలో ఉన్న జీఎస్టీ అధికారుల నిర్లక్ష్యం కూడా తోడవడంతో వారు ఆడిందే ఆటగా సాగింది. కాంగ్రెస్? ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది డిసెంబరు మూడో వారంలో ట్యాక్స్? కన్సల్టెంట్‌ను అరెస్టు చేశారు. 32 బోగస్ కంపెనీల నుంచి రూ.288 కోట్ల ఐటీసీని దాదాపు 350 ట్యాక్స్ పెయర్‌లకు బదిలీ అయినట్లు గుర్తించారు. అందులో అత్యధికంగా రూ.120 కోట్లను ఐటీసీ మొత్తం ఆర్మూర్? కేంద్రంగా ఏర్పాటు చేసిన బోగస్? కంపెనీకి వెళ్లినట్లు గుర్తించారు. మిగిలిన మొత్తాన్ని హైదరాబాద్‌లోని పంజాగుట్ట, చార్మినార్, సరూర్‌నగర్, హైదరాబాద్ డివిజన్ల పరిధిలోని వివిధ వ్యాపార సంస్థలకు, మరికొంత మొత్తం ఏపీ, కర్ణాటక, ఒడిశా, గుజరాత్?, మహారాష్ట్రలకు ఐటీసీ బదలాయింపు చేసినట్లు గుర్తించారు.దాదాపు 150 సంస్థల ఖాతాల్లోని ఐటీసీని స్తంభింప చేయడంతో పాటు మరో 17 మంది డీలర్లకు చెందిన బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపచేశారు. తాజాగా ఆయా సంస్థలు ఉపయోగించిన ఐడీలు తమకు ఇవ్వాలని కోరుతూ జగిత్యాల సహాయ కమిషనర్ ఆనందరావు డీజీపీ జితేందర్?కు గత నెలలో లేఖ రాశారు. మరోవైపు హైదరాబాద్? కేంద్రంగా ఇటీవల వరకు కొనసాగిన ఓ జాయింట్ కమిషనర్ ఓ సంస్థ నుంచి దాదాపు రూ.8 కోట్ల వరకు లబ్ధి పొంది అరెస్టు కాకుండా కాపాడారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు రూ.11 కోట్లను ఐటీసీ లబ్ధి పొందిన వ్యాపార సంస్థల నుంచి వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

# బాబా సిజ్జికీని హత్యచేసింది తామేనట!

### - లారెన్స్ గ్యాంగ్ ప్రకటన

ముంబయి (ప్రజా మంటలు) : ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది.బాబా సిద్ధిఖీ శనివారం సాయంత్రం ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. పలువురు దుండగులు అతడిపై కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ కేసులో అరెస్టయిన హరియాణాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్(ఒజీలితీవనిఇవ ఃతిబష్ట్రనీతి)కు చెందినవారమని పేర్కొన్నట్లు ఇప్పటికే పోలీసు వర్గాలు వెల్లడించిన విషయం తెలిసిందే.మూడో నిందితుడైన యూపీకి చెందిన శివకుమార్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సిద్ధిఖీని హత్య చేయడానికి నిందితులు కొన్ని నెలలుగా ప్రణాళికలు రచించారని.. ఆయనకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ..సిద్ధిఖీ నివాసం, కార్యాలయంపై నిఘా పెట్టారని తెలిపారు. ఈ హత్య చేసినందుకు గాను నిందితులకు ఒక్కొక్కరికి బిష్ణోయ్ గ్యాంగ్ రూ.50,000 అడ్వాన్స్, మారణాయుధాలు ఇచ్చినట్లుగా తమ విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. 'ఇది ట్రైలర్ మాత్రమే.. ముందుంది అసలు సినిమా' అంటూ నాడు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ పోస్ట్ పెట్టారు. తాజా ఘటన నేపథ్యంలో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు.

**హత్యతో.. దేశం మొత్తం భయపడుతోంది': అరవింద్ కేజ్రీవాల్**

బాంద్రా మాజీ ఎమ్మెల్యే, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య మహారాష్ట్ర, బాలీవుడ్‌లో సంచలనం రేపుతోంది. ఈ ఘటనపై ఎక్స్ వేదికగా దిల్లీ మాజీ ముఖ్యమంత్రి , ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు.ఈ హత్యతో మహారాష్ట్ర మాత్రమే కాదు దేశం మొత్తం భయపడుతోందన్నారు. దిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని.. గ్యాంగ్‌స్టర్ పాలన తీసుకురావాలనుకునేవారికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.శనివారం సాయంత్రం ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. బాబా సిద్ధిఖీపై ముగ్గురు దుండగులు ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. చాలా కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సిద్ధిఖీ కొన్ని నెలల క్రితమే ఎన్సీపీలో చేరారు.

## భారీ దాడికి హమాస్ ప్రణాళికలు

### - వాషింగ్టన్ పోస్టు కథనం

న్యూయార్క్ (ప్రజా మంటలు) : హమాస్ దళం గత అక్టోబర్ 7 నాటి దాడికి ముందు 9/11తరహా భారీ దాడికి కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా పత్రిక వాషింగ్టన్ పోస్టు కథనం ప్రచురించింది. ఈ దాడి కుట్రకు సంబంధించిన రికార్డులను ఖాన్ యూనిస్‌లోని హమాస్ కమాండ్ సెంటర్ నుంచి ఇజ్రాయెల్ దళాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. హమాస్ రాజకీయ, సైనిక విభాగాలు రెండేళ్లుగా వరుసగా జరిపిన సమావేశాల మినిట్స్‌లో ఈ ప్లాన్లు పొందుపర్చి ఉన్నాయి. ఈ మేరకు ఇరాన్ అధికారులతో హమాస్ నేత యాహ్యా సిన్వార్ సంభాషణలను కూడా గుర్తించారు. వీటిని ఐడీఎఫ్ బలగాలు వాషింగ్టన్ పోస్టు, వాల్‌స్ట్రీట్ జర్నల్ వంటి పత్రికలకు అందజేశాయి. శనివారం న్యూయార్క్ టైమ్స్ పత్రిక పది సమావేశాలకు సంబంధించిన మినిట్స్‌ను పబ్లిష్ చేసింది.సిన్వార్‌తోపాటుతో పాటు అతడి సోదరుడు, మహమ్మద్ డెయిఫ్, మార్వన్ ఇస్సా ఈ సమావేశాలకు హాజరైనట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌పై దాడులకు రైల్వేలు, బోట్లు, గుర్రపు బగ్గీలను వినియోగించాలని వారు ప్లాన్ చేశారు.2021లో అలీ ఖమేనీ సహా ఇరాన్ కీలక నాయకులను సిన్వార్ కలిసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అదనపు ఆర్థిక మద్దతుతోపాటు.. సైనిక సాయం కూడా కోరినట్లు సమాచారం. ఖుద్స్ చీఫ్ ఇస్మాయిలీ ఖానీతో అతడు సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.హామస్ వద్ద ఇజ్రాయెల్‌లోని కీలక ప్రదేశాలకు చెందిన భారీ డేటాబేస్ ఉన్నట్లు బయటపడింది. దీనిలో సుమారు 17,000 ఫొటోలున్నాయి. వీటిని డ్రోన్లు, శాటిలైట్లు తీసినట్లు తెలుస్తోంది. వీటిలో కొన్నింటిని సామాజిక మాధ్యమాల నుంచి సేకరించినట్లు సమాచారం.



# హరిహర సన్నిధిలో వైభవంగా ఏకాదశి వేడుకలు

ధర్మపురి అక్టోబర్ 13 (ప్రజా మంటలు) : ధర్మపురి క్షేత్రంలో, ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి పర్వ దిన వేడుకలను ఆదివారం సాంప్రదాయ రీతిలో వైభవంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాలనుండి, ఆర్టీసీ బస్సు లలో, ప్రైవేటు వాహనాలలో ఉదయాత్పూర్వం నుండి ఏతెంచిన భక్తులు, గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, గోదావరి మాతను పూజించి, మొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం దైవ దర్శనార్థం దేవాలయాల వద్ద వేచి ఉన్నారు. పర్వ దిన సందర్భంగా దేవస్థానం ఏసీ ఈఓ సంకటాల శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సి. అ. శ్రీనివాస్ అలువాల ద్వారా, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, ఆర్చక పురోహి తులు బొజ్జా సంతోష శర్మ, సంపత్ కుమార శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, రాజగోపాల శర్మ, ఉప ప్రధానార్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచార్య, వివిధ ఆలయాల అర్చకులు విధివిధాన వేదోక్త, పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పర్వ దిన పూజలు, నిత్య కళ్యాణాదులను నిర్వహించారు. ప్రధానంగా ప్రధానాలయాలలో ఏకాదశి పర్వదినాన మహా క్షీరాభిషేకాది కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా నిర్వహించారు. పండితులు, అర్చకులు, సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించి, భక్తులకు వలసిన ఏర్పాట్లు గావించారు. భక్తులు ఏకాదశి సందర్భ ప్రత్యేక పూజాదికాలలో పాల్గొన్నారు.

**భక్తి శ్రద్ధలతో గోదావరి స్నానాలు**

ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి సందర్భంగా అశేష భక్తులు తరలి వచ్చారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులలో "పాశాంకుశై ఏకాదశి"గా పేరెన్నికగన్న ఈరోజు యమ పాశానికి అంకుశంగా పని చేసే ఏకాదశిగా భావించ బడుతూ, మదన ద్వాదశి వ్రతానికి తొలి దినమై, పుణ్య కాలమని భావించే భక్తులు సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు ఆచరించి, దానాదులు చేయాలనే సంకల్పంతో సుదూర ప్రాంతాల నుండి ఉదయాత్పూర్వమే క్షేత్రానికి చేరుకున్నారు. దక్షిణాభిముఖంగా ప్రవ హిస్తూ విశేష మహిమాన్వి తయైన గోదావరిలో భక్తులు, యాత్రికులు, స్థానికులు, ఉషకాల సమయంలో పవిత్ర గోదా వరి నదిలో మంగళ స్నానాలు ఆచరించారు. భక్తులు దాన ధర్మాలను ఆచరించారు. గోదావరి పురోహితులచే అర్ఘ్య ప్రదాన, సంకల్పాదులను చెప్పించుకుని, గోదావరి మాతను అర్చించారు. వేకువ జామునే ఆలయాల అర్చకులు వేద మంత్రాలతో, మంగళ వాద్యాలతో దేవస్థానం నుండి గోదావరికి వెళ్ళి, పవిత్ర నదీ జలాలను తెచ్చి, స్థానిక మూల విరాట్టులను అభిషేకించారు. ప్రధానాలయాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ, శ్రీవేంకటేశ్వర, వేణు గోపాల, యమ ధర్మరాజ, ప్రసన్నాంజనేయ, శ్రీరామ, శ్రీరామలింగేశ్వరాది ఆలయాలలో ప్రత్యేక ప్రాతః కాల అర్చనలు, పూజలు, అభిషేకాలు, నిత్య కళ్యాణాది కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు దైవ దర్శ నాలు చేసుకున్నారు.

# ధర్మపురిలో ఘనంగా విజయ దశమి వేడుకలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**



ధర్మపురి అక్టోబర్ 13 (ప్రజా మంటలు) : నాతన సాంప్రదాయాల వారసత్వ క్షేత్రమైన ధర్మపురి పట్టణంలో దసరా ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. విజయ దశమి పర్వ దిన సందర్భంగా దేవస్థానం లోని ప్రధానాల యాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామ లింగేశ్వర, శ్రీనర్మదేశ్వర దేవాలయాలలో శరన్నవరాత్రి ఉత్సవ ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవస్థానం ఎసి ఈఓ శ్రీనివాస్ మార్గ దర్శకత్వంలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ఆలయాల అర్చకులు విధివిధాన వేదోక్త పూజలు గావించారు. శ్రీరామ లింగేశ్వర, నర్మదేశ్వర దేవాల యాలలో దుర్గాదేవికి షోడశో పచార పూజలొన రించారు. సాయంత్రం అయిదు గంటలకు శ్రీయోగానంద, ఉగ్రనారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల ఉత్సవ మూర్తులకు దేవస్థాన ప్రాంగణంలో నిలిపి పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఉత్సవ సేవలను ప్రారంభించారు. అలా సేవలకు పూజలు చేసి, భుజాలపై మోసి, సీమొల్లంఘన సాంప్రదాయ కార్యక్రమంలో పాల్గొన్న తొలి ఎమ్మెల్యే అయ్యారు.

అనంతరం ముప్వురు స్వాముల ఉత్సవ మూర్తులను భక్త జనం ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, భక్తులు తోడు రాగా దేవస్థానం నుండి ఇసుకస్థంభం, మున్సిపల్ కూడలి, శ్వేతవరాహ తీర్థం, కమలాపూర్ చౌరస్తా ద్వారా జాతీయ రహదారి దాటి, వేదమంత్రాలో, మంగళ వాద్యాలతో, సీమోల్లంఘనం గావించి, క్షేత్రానికి రెండు కిలోమీటర్ల దూరాన గల శమీవృక్ష పూజా ప్రదేశానికి అశేష భక్తులు అనుసరించి రాగా, ఊరేగింపు నిర్వహించారు. ఏడాది కోసారి మాత్రమే దక్షిణ దిగ్యాత్రలో భాగంగా విజయ దశమి నాడు తమ వద్దకు అపురూపంగా ఏతేంచే స్వాములను, ఆ ప్రాంతవాసులు, కమలాపూర్, నాగారం గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించగా, ముత్తయిదువలు, రోడుకిరువైపులా నిలుచుని హారతులు పట్టారు. శీలం పెద్దగంగారం బహూకృత స్థలంలో, నూతన నిర్మిత పూజా నిర్మాణ ప్రదేశంలో, ప్రత్యేక వేదికపై ముప్వురు దైవాలను ఆసీనులగావించారు. భూమి పూజ, పుణ్యాహ వాచనం, గణపతిపూజ, ఆయుధ, శమీపూజలు వేదమంత్రాలతో గావించారు. తిరుగు ఊరేగింపులో... బస్ స్టేషన్ అవరణలో రావణ సంహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, ఈఓ శ్రీనివాస్, డీ ఎస్ పీ , ధర్మపురి సి ఐ నర్సింహా రెడ్డి, ఎస్ ఐ మహేష్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు, భూదాత గంగారాం కుటుంబ సభ్యులు, అధికార, ప్రజా ప్రతినిధుల వర్గాలు, భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని వేద పండితులు రమేశ్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నెరేళ్ళ శ్రీనివాసా చార్య, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్య, నరసింహ మూర్తి, రమణాచార్య, అరుణ్, కిరణ్, ప్రవీణ్, వంశీ, విజయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది, సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు.



# రావణాసురుని దిష్టిబొమ్మ దహనం

జనగామ అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
జనగామ పట్టణంలోని పాత బీడ్ బజారులో రావణాసురుని దిష్టిబొమ్మను బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త నిప్పంటించి దహనం చేశారు. గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయిత శ్రీకాంత్ సోమ హనుమంతరావు గోవిందులోయ బుస్సా పాండు పోకల వేణు కిషన్ కాలాని హరి ప్రసాద్ లోయ మంజు లకన్ లోహియా నరసింహ పాల్గొన్నారు.



# ఘనంగా విజయదశమి వేడుకలు

## పోల్బాల్ టెంపుల్ లో భక్తుల రద్దీ

సికింద్రాబాద్, అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
విజయదశమి వేడుకలు బన్సీలాల్ పేట, బౌద్ధనగర్ డివిజన్ లో కన్నులపండువగా జరిగాయి. ప్రధాన ఆలయాలన్నీ భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. పద్మారావునగర్ లోని పోల్ బాల్ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులు ఈసందర్భంగా స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. శ్రీస్వామి వారి మహాహారతిలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రాజేశ్ గౌడ్ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన కళాకారులను ఈసందర్భంగా ఆలయ చైర్మన్ రాజేశ్ గౌడ్ సన్మానించి, ప్రశంసాపత్రాలను అందచేశారు.

# శ్రీ దుర్గా దేవి వస్త్రాలు మహా కలశం వేలం

## వేలంలో కళశాన్ని దక్కించుకున్న బొమ్మన కుమార్ మాధవి దంపతులు

గొల్లపల్లి అక్టోబర్ 13 (ప్రజ మంటలు) :



మండలంలోని భీమ్రాజు పల్లి గ్రామంలో మొట్టమొదటిసారిగా శ్రీ దుర్గా భవాని మాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నవరాత్రులు పూజలు అందుకున్న అమ్మవారి వస్త్రాలు, మహా కలశం భక్తుల ఆసక్తి మేరకు వేలం వేశారు. ఈ సందర్భంగా మహా కలశం వేలంపాటలో పోటీపడ్డారు. చివరిగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్ మాధవి దంపతులు 26116/- కు వేలంలో దక్కించుకున్నారు. అలాగే నవరాత్రుల పూజలందుకున్న 8 చీరలు వేలం వేగా సింగారపు దొంగనా లక్ష్మీ దంపతులు 13216, బొమ్మన కుమార్ మాధవి దంపతులు 10216, బొమ్మన వెంకటేశం రమ దంపతులు 10216, కళ్లెం మల్లారెడ్డి రాజవ్వ 7016, రేవల్లి సాగర్ 6116, దూసరవి,అనిత దంపతులు5016,సామల జనార్ధన్,రాజేశ్వరిదంపతులు4016, రేవెల్లి సత్తయ్య, రాజ సులోచన దంపతులు 3,816 వేలంపాడి దక్కించుకున్నారు. వీరికి శ్రీ వేద విద్య సామ్రాట్, జ్యోతిష్య రత్న బిరుదాంకితులు శ్రీ తిప్పర్తి సత్య చార్యులు చేతుల మీదుగా అందజేశారు.





## ఎవరెస్టు శిఖరం అధిరోహించిన రిషిత -మనిరాజ్ అన్నచెల్లెలను సన్మానించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల అక్టోబర్ 13 (ప్రజా మంటలు) :
రాయికల్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన లక్కం రిషిత, లక్కం మనిరాజ్ లు ఎవరెస్ట్ శిఖరం ఎక్కి వచ్చిన%వ% సందర్భంగా మమెలసి జీవన రెడ్డి శాలువలతో సన్మానించి, జ్ఞాపిక ఇచ్చి, సన్మానించారు.. భవిష్యత్ లో ఇలాంటి ఎన్నో విజయాలు సాధించాలని రిషిత మనిరాజ్ లని అభినందించారు.

## మాల సంఘం ఆధ్వర్యంలో కొలువైన శ్రీ దుర్గా దేవి అమ్మవారి శోభాయాత్ర



చిగురుమామిడి అక్టోబర్ 13 (ప్రజా మంటలు) :
ఇందుర్తి గ్రామం లో విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవాల నడుమ దసరా వేడుకలు చేసుకున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గ మాత విగ్రహ దాత అయినటువంటి పోతర వేణి కవిత - కుమారస్వామి దంపతులకు తొమ్మిది రోజులపాటు పూజ నిర్వహించిన కలిశము ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, డప్పు చప్పట్లు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించి, అందజేయడం జరిగినది. విజయదశమి రోజు శమీ పూజ, ఆయుధ పూజ, వాహనాలకు పూజలు చేసుకున్నారు. ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చిపుచ్చుకుంటూ ఆత్మీయ ఆలింగానాలు చేసుకుని శుభాకాంక్షలు తెలుయజేసుకున్నారు.ఈ కార్యక్రమం లో శంకర్, మొగిలి, శ్రీనివాస్, అంజి, కిషోర్, వెంకటి, ప్రశరములు,తిరుపతి, విజయ్, శ్రీనివాస్, ప్రభాస్ శ్రీనివాస్, మహేష్, హరీష్, సంపత్, రాకేష్, మణికంఠ, సంపత్, సందీప్, శివ, మహిళాలు సంఘా కమిటీ నిర్వాహకులు అట్టహాసంగా నిర్వహించారు.

## విజయదశమి సందర్భంగా శమీ పూజ కార్యక్రమం



జనగామ అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
శ్రీ నగరేశ్వర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో విజయదశమి సందర్భంగా శమీ పూజ కార్యక్రమం పట్టణ పురోహితులు బ్రహ్మశ్రీ అప్పయ్య శాస్త్రి సిద్ధాంతి శ్రీకృష్ణమాచార్య ఆధ్వర్యంలో వైభవంగా శమీపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు జమ్మి పెట్టుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య ప్రధాన కార్యదర్శి బుద్ధ రమేష్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త ట్రస్టు సభ్యులు పజ్జూరి జయహరి బిజ్జాల నవీన్ పుల్లూరు శ్రీనివాసులు జైన రమేష్ నాగ బండి రవీందర్ ఆరుగుల శ్రీనివాస్ గట్టు వెంకటేశ్వర్లు పజ్జూరి లక్ష్మీనరసయ్య అయిత శ్రీనివాస్ ఉప్పుగల రవీందర్ శర్మిరాల ఉపేందర్ నరసింహారావు యమసాని శ్రీనివాస్ బచ్చు రమేష్ రేణిగుంట శ్రీనివాస్ దేవాలయ పూజారులు నరసింహ ప్రసాద్ ఈశ్వర్ తదిరులు పాల్గొన్నారు.



గొల్లపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో విజయ దుర్గ సేవాసమితి వారి ఆధ్వర్యంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా శోభయాత్ర నిర్వహించారు.

# పిఎంకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

- గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రధానం



జమ్మికుంట (ప్రజా మంటలు )
జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో గత పది రోజులుగా గ్రామస్థాయి క్రికెట్ పోటీలను గత పది రోజులుగా పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు పిఎంకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు ఎం కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రభాకర్ గౌడ్ తెలిపారు పోటీలలో గెలుపొందిన క్రికెట్ టీం క్రీడాకారులకు నగదు తో పాటు ట్రోఫీలను పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ అందజేశారు మొదటి బహుమతి సాధించిన ఏజె లెవెన్ క్రికెట్ టీం కెప్టెన్ రెడ్డబోయిన అజయ్ కి 12000 వేల నగదు తో పాటు ట్రోఫీ నీ అందజేశారు అదేవిధంగా రెండో బహుమతి ఈగల్ 11 క్రికెట్ టీం కెప్టెన్ బోయిని వినయ్ సభ్యులకు 8 వేల నగదు తో పాటు ట్రోఫీని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్ పల్లె సంపత్ గౌడ్ గండి రంజిత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గొల్లపల్లి లో ఘనంగా దసరా ఉత్సవాలు

గొల్లపల్లి అక్టోబర్ 13 (ప్రజా మంటలు) :
జంబి చెట్టుకు పూజలు చేసిన నిర్వాహకులు గొల్లపల్లి మండల కేంద్రంలో లో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి జంబి చెట్టుకు ప్రత్యేక పూజలు దసరా, బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక భక్తి శ్రద్ధలతో ఘనంగా ఏర్పాట్లు చేశారు దసరా ఉత్సవాలలో ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అల్లర్లు కాకుండా తగు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు తరలి వచ్చి స్వయంగా పూజలు చేసిన జంబి చెట్టుకు ఆకులు తెంపుకుని ఒకరికొకరు జంబి ఆకు పంచుకుంటూ అలాయ్ - బలాయ్ తీసుకొని దసరా శుభా కాంక్షలు తెలుపు ఊరేగింపు దసరా దేవుణ్ణి తీసుకొని డప్పు సప్పుల్లతో బైండ్ల వారి నృత్యాలు చేస్తూ యువత, గ్రామస్తులు ఊరేగింపుగా జంబి చెట్టు వరకు వెళ్లారు. ప్రత్యేకంగా సజీవంగా ఉన్న జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ కుల సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు గ్రామ ప్రజలు మహిళ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గంగపూర్ ఆడబిడ్డకు టీచర్ జాబ్

## సన్మానించిన మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



జగిత్యాల అక్టోబర్ 13 (ప్రజా మంటలు) :
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన సీర్నేని అంజలి, ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ది ఎస్ సి లో టీచర్ గా ఉద్యోగం సాధించిన సందర్బంగా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్, ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో అడ్డగట్ల సుభాష్,రెంటం శ్రీధర్,గుర్రం తిరుపతి,రమేష్,జగన్,సిర్నేని సంతోష్,వివేక్, రంజిత్,గంగన్న,మల్లయ్య,రెంటం శేఖర్,కమ్మరి గంగన్న,గోలి తిరుపతి, సాగర్,రెంటం తిరుపతి,లచ్చయ్య,కట్ట శేఖర్,శ్రీనివాస్,%బా% ప్రకాష్,బొల్లి లింగన్న,మామిడాల నరేశ్,మనుక భూమన్న,ఉరుమట్ల సంతోష్,బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు సాయిబాబా ఆలయానికి వెండి కిరీటం బహూకరణ

మల్లాపూర్ అక్టోబర్ 13 (ప్రజామంటలు) :



మెట్ పల్లి మండలంలోని ఆత్మకూరులోని శ్రీ శిరిడి సాయి ఆలయానికి కాంగ్రెస్ నాయకులు కూన గోవర్ధన్, వెండి కిరీటాన్ని బహుకరించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని సాయిబాబా విగ్రహానికి అమర్చారు. ఈ సందర్భంగా కూన గోవర్ధన్ కుటుంబసభ్యులను స్థానిక నాయకులు, సాయి భక్తులు శాలువాతో సత్కరించారు.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు సూరి భగవంతం

## అక్టోబర్ 14...సూరి భగవంతం జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 - ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు.

ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు.
ప్రాథమిక విద్యా భ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేధో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.

ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తమ 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు.
భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు.


1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రీకరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు.

ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు.

1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంత మైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండ మైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు.

డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర




సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు.

"1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువ రించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి.

సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.



# సిరిసేడులో ఘనంగా శమి పూజ వేడుకలు

జమ్మికుంట అక్టోబర్13 (ప్రజా మంటలు) :
ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి దేవస్థానంలో విజయదశమి పండుగ సందర్భంగా శనివారం శమి పూజ కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. విజయదశమి పండుగ ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయం నుండి భక్తులు గ్రామస్తులు సిరిసేడు, పాతర్లపల్లి గ్రామాల మధ్య ఉన్న అతి పురాతనమైన జమ్మి చెట్టు వద్దకు భక్తులందరూ చేరుకొగా అర్చకులు భైరవభట్ల నరేందర్ శర్మ శమి పూజా కార్యక్రమాలు నిర్వహించి,భక్తులకు జమ్మి చెట్టు ఆకులు అందిస్తూ ఆశీర్వదించారు..దేవా ఫోటో స్టూడియో ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్, ఆలయ అర్చకులు భైరవభట్ల నరేందర్ శర్మ,అలయకమిటి కోశాధికారి మురహరి నరేందర్,కొక్కుల దేవేందర్, లక్ష్మీపతి, రైతు సమన్వయ సమితి సభ్యులు ముస్తఫా ఖాన్, మాజీ ఎంపీటీసీ నేరెళ్ల కుమారం స్వామి, వంగ రామకృష్ణ, కురిమిండ్ల చిరంజీవి, మురహరి పూర్ణ చందర్,బుర్ర రాములు,కట్కూరి సురేష్,నహీం పాషా, గన్ను రమేష్, సంపత్, రాజు,సతీష్, రమేష్, చిరంజీవి, రమేష్,తిరుపతి గ్రామస్థులు పాల్గొన్నారు..

# ముత్యంపేటలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సమావేశం



మల్లాపూర్ అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
మల్లాపూర్ మండలం ముత్యంపేట్ ఉప తపాలా కార్యాలయంలో గ్రామీణ తపాల ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బదిలీ అయిన సబ్ పోస్ట్ మాస్టర్, ఇట్టిడి రాజేష్ ను సన్మానసన్మానించారు. సన్మాన కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ, బదిలీ అనేది అందరికీ తప్పనిసరి అని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లవలసిన బాధ్యత మనందరి పైన ఉందని 2030 నాటికి ప్రైవేటుపరం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ తపాల జీవిత బీమా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ గురించి వాటి వల్ల కలిగే ప్రయోజనం సూచించారు ఇప్పుడు మారుతున్న ప్రభావాన్ని బట్టి ఉద్యోగులందరూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు మంచి జరిగేటట్టు చేయాలని సూచించారు ఇట్టి సమావేశంలో కరీంనగర్ శేఖర్ మరియు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు దూరిశెట్టి రాజేశం, ఎస్పి రామకృష్ణ, యజ్ఞరపు వెంకటరమణ, గౌతమ్, సురేష్, యం భూమేష్, ఆర్ భూమయ్య, ఎస్పి రమణ, చంద్రమౌళి, స్వాతి వెంకటేష్ పాల్గొన్నారు.

# బీదలబస్తీ రేణుక ఎల్లమ్మ టెంపుల్లో దసరా వేడుకలు..

సికింద్రాబాద్, అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
సీతాఫల్మండి డివిజన్ బీదలబస్తీ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో దేవినవరాత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. చివరిరోజున ఎం బీ ఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత, పద్మారావు నగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్ రెడ్డి బీదల బస్థిలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన్ని ఆలయ కమిటీ సభ్యులు ఎం. సీతారాం,శేషగిరిరావు, మల్లేష్,గోవింద్,రాజమౌళి, సత్యనారాయణ ఆంజనేయులు, శేఖర్, వివేక్, చందన వందన,అర్చకులు నరేష్, నిఖిల్ ఆద్వర్యంలో ఘనంగా సత్కరించారు. వందలాది మంది భక్తులు ఈసందర్బంగా అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.



# జెండా ఎగురవేసిన మున్నూరు కాపులు ఘనంగా బుగ్గారం లో పటెండ్ల ర్యాలీ

## సంఘం భవనానికి రూ.10 వేల విరాళం ప్రకటించిన మల్లేశం

బుగ్గారం/ జగిత్యాల అక్టోబర్ 13 (ప్రజా మంటలు జిల్లా ప్రతినిధి) :
జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో శనివారం శ్రీ దుర్గా భవాని మున్నూరు కాపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులు జాబు పోచన్న మున్నూరు కాపు జెండాను ఎగుర వేశారు. స్థానిక బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి గ్రామంలోని మున్నూరు కాపులు అంతా ఐకమత్యంతో పాల్గొని ఘనంగా భారీ ర్యాలీ నిర్వహించారు. గత నాలుగు ఏండ్ల నుండి ప్రతి ఏటా దసరా రోజున నిర్వహిస్తున్న ఈ కార్య క్రమానికి కాపులంత హాజరై వారి ఐక్యతను చాటారు. ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ త్వరలో స్థల సేకరణ చేసి, మున్నూరు కాపు ఐక్య సంఘం కు ప్రత్యేక భవనం, ఫంక్షన్ హాల్ నిర్మింప జేయాలని సూచించారు. రాజకీయాల కతీతంగా అందరూ సహకరించి స్థలం సేకరణ, భవనం, ఫంక్షన్ హాల్ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. మున్నూరు కాపు సంఘం భవనం నిర్మించేందుకు గాను గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు పొలం పెల్లి మల్లేశం రూ.10,000 విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. కుల సంఘం సభ్యులు అంతా హర్షం వ్యక్తం చేశారు. విరాళం ప్రకటించిన పొలంపల్లి మలేశం కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన దసరా ఉత్సవాలలో మున్నూరు కాపులు పాల్గొని ప్రశాంతం గా ఉత్సవాలను విజయ వంతం చేసుకున్నారు.

# ఘనంగా సాయి నాథుని మహా సమాధి దినోత్సవం

ధర్మపురి అక్టోబర్ 13 (ప్రజా మంటలు) :
క్షేత్రస్థ గోదావరీ నదీ తీరస్థ శ్రీసాయి. బాలాజీ మందిరంలో విజయదశమి సందర్భంగా సాయిబాబా మహా సమాధి దినోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ నిర్మాతలు ఒజ్జల ప్రవీణ్ శర్మ, ట్రస్టీ చైర్మన్ గోలి రాంప్రసాద్ మార్గదర్శకత్వంలో, స్థానిక వేద పండితులు ఆధ్వర్యంలో, ఉదయాతూర్వంనుండి విధివిధాన సాంప్ర దాయ రీతిలో పంచోపనిషత్ పురుషసూక్త యుక్త ప్రత్యేక పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేకించి కుల మత, వర్ణాలకు అతీ తంగా దేవస్థానం పక్షాన నిర్వహించిన మహా క్షీరాభిషేక కార్యక్రమంలో అశేష భక్తజనులు తమ స్వహస్తాలతో, సాయినాథున్ని క్షీరాభిషిక్తుడిని గావించారు.
**గోదావరిలో దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం :** ధర్మపురి క్షేత్రంలోని శ్రీనర్మదేశ్వర, కన్యకా పరమేశ్వరీ ఆలయాలలో, టి టి డి కళ్యాణ మంటపంలో నవ రాత్రి ముగింపు పూజలు నిర్వహించగా, నర్మదేశ్వర మందిరంలో, నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో వేరువేరుగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శరన్నవ రాత్రి ఉత్సవ వేడుకల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి ప్రతిష్ఠిత దుర్గామాతల విగ్రహాలకు సాంప్రదాయ వేదోక్త ప్రత్యేక పూజలొనరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శమీ అయుధ ప్రత్యేక కార్యక్రమాలు పూర్తయిన అనంతరం రాత్రి 9గంటలకు ప్రారంభించి, అశేష భక్త జనం తోడురాగా, వేద మంత్రాలతో, భగవన్నామ స్మరణలతో, దేవీ స్తోత్రాలతో, మంగళ వాద్యాలతో ఆలయం నుండి గోదావరి వరకు ఊరేగింపు నిర్వహించి, గోదావరి నది పవిత్ర జలాలలో విగ్రహాలను నిమజ్జనం గావించారు.





# నవయాన బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సామ్రాట్ అశోక చక్రవర్తి విజయదశమి వేడుకలు..

మెట్ పల్లి అక్టోబర్ 13 (ప్రజామంటలు) :
నవయాన బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సామ్రాట్ అశోక చక్రవర్తి కళింగ యుద్ధం తర్వాత హింసను వీడి అహింస మార్గాన్ని ఎన్నుకొని బుద్ధుడు బోధించిన మార్గమైనటువంటి శాంతి కరుణలతో కూడిన బౌద్ధాన్ని స్వీకరించడం జరిగిందని, దానిని పురస్కరించుకొని అప్పటినుండి అశోక విజయదశమిగా నిర్వహించడం జరుగుతుంది అశోకుని తదనంతరం కొందరు కుట్రపూరితంగా బౌద్ధాన్ని భారతదేశం నుండి బయటకు తరిమేసి బౌద్ధాన్ని లేకుండా చేయడం జరిగిందని, తర్వాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న 6 లక్షల మందితో బౌద్ధాన్ని స్వీకరించి ఈ దేశంలో మళ్ళీ పునరుద్ధరించడం జరిగిందని వక్తలు అన్నారు. అందుకే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని బోధిసత్వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గా వ్యవహరించడం జరుగుతుంది ముందు ముందు ఇంకా గొప్పగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది దీని కొనసాగింపుగా మేము బైక్ ర్యాలీ నిర్వహించి చావిడి వద్ద పంచశీల జెండా ఆవిష్కరించడం జరిగింది అలాగే సాయంత్రం అలైబాలై కార్యక్రమం నిర్వహించి వచ్చే ప్రజలకు ఉచితంగా ఐస్ క్రీమ్ పంపిణీ చేశారు? .ఈ కార్యక్రమంలో దయ్య రాజారామ్, నిరటి నరేందర్, పాలెపు గంగ నరసయ్య, దయ రఘువీర్, నల్ల పురుషోత్తం, దిబ్బ అంజయ్య, సోమిడి మహేందర్, గొరుమంతుల సురేందర్, గోరు మంతుల మురళి, మద్దెల లక్పతి, నీరటి రాజేందర్, అంబటి రాజేందర్, బత్తుల ప్రమోద్, ఆసతి శివ, సోమిడి శ్యాంప్రసాద్, సాతల నరసయ్య, సుమంత్, మాధవన్,మని, యశ్వంత్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

